3

# సమ ఉజ్జీలు

పూర్వం మహా బలవంతుడైన మూషికరాజు ఉండేవాడు.

బలదర్పంతో తాను మనుషులకన్నా కూడా గొప్పవాడినని విర్రవీగేవాడు. ఆ మూషిక మహారాజుగారికి ఒక అందమైన కూతురు ఉండేది. ఆ ఎలుక చిన్నారిని వివాహమాడాలని ఎందరెందరో మూషిక వీరకుమారులు ఉవ్విళ్ళూరుతుండేవారు. అయితే.., మహారాజు మాత్రం తన కూతుర్ని ప్రపంచంలోకెల్లా అత్యంత బలవంతుడికే ఇచ్చి పెళ్ళి చేయాలనుకోవడంవల్ల, వారెవరినీ తన కుమార్తె ఛాయలకు కూడా రానిచ్చేవాడు కాదు.

అతి శక్తిమంతునికైతే అమ్మాయిని ఇవ్వాలని అనుకున్నాడే కాని, అలాంటి వారెవ్వరైనదీ తెలుసుకోలేకపోయాడు మూషికరాజు. అందువల్ల తన మంత్రి, దండనాదులను పిలిచి ఈ విషయమై సలహా అడిగాడు. వారంతా సుదీర్ఘంగా చర్చించి చివరకు అందరిలోకీ అతి శక్తిమంతుడు సూర్యుడు అని నిర్ణయించారు. వెంటనే మూషికరాజు తన రాయబారులను సూర్యుడి దగ్గరకు పంపించి తన కుమార్తెను పెళ్ళి చేసుకోవలసిందిగా కోరాడు.

రాయబారుల మాటలు విని సూర్యుడు- "అయ్యలారా..! మీరనుకున్నట్లు నేను అమిత బలవంతుడిని కాను. మేఘుడు నాకంటే బలవంతుడు. మేఘం దట్టంగా నన్ను కమ్మివేసిందంటే భూమిని చీకటి ఆవరిస్తుంది. అప్పుడు నేను చేయగలిగింది ఏమీలేదు" అన్నాడు.

సూర్యుని మాటలు విని రాయబారులు మేఘమండలానికి వెళ్లి మేఘునికి తమ మహారాజు మనోభావాన్ని తెలిపారు. ఆ మాటలు విని మేఘుడు "అయ్యో... మీరెంత పొరబాటు పడ్డారు! నేనెంత బలవంతుడినైనా వాయుదేవుని ముందు బలాదూరే కదా..! గట్టిగా గాలి వీచిందంటే నేను ఎగిరి పోవలసిందే!" అన్నాడు.



"సరే...వాయుదేవులవారి దగ్గరకే పోయి అడుగుదాం!" అని బయలుదేరారు రాయబారులు. వారి మాటలు విని గాలిదేవుడు- "మీరు చెప్పింది బాగానే ఉంది కాని, నాకంటే బలవంతుడున్నాడే..!" అన్నాడు.

"వారెవరు స్వామీ?" అన్నారు రాయబారులు దిగులుగా.

"ఇంకెవరు...పర్వతుడే! నేనెంత గట్టిగా వీచినా పర్వతాలు అణుమాత్రం కూడా కదలవు" అన్నాడు వాయుదేవుడు.

ఉసూరుమంటూ పర్వతుని సమీపించారు రాయబారులు. వారు చెప్పినదంతా సావధానంగా విన్నాడు పర్వతుడు. "నేను అమిత బలవంతుడిననే మాట నిజమే ! కాని..." అంటూ నసిగాడు.

"కాని... ఏమిటి స్వామీ? మీకన్నా బలవంతులు ఉన్నారా?" అన్నారు వారు.

"లేకేం... ఉన్నారు. ఎంతో దృఢమైన నా శరీరానికి నిత్యమూ కన్నాలు చేస్తుంటుంది ఎలుక. అది ఎన్ని బొరియలు చేసినా నేను కిమ్మనకుండా ఉండవలసి వస్తోంది. అయినా... మీలోనే ఇంతటి బలశాలుల్ని పెట్టుకొని ఊరూ, వాడా వెతుకుతున్నారేమిటి?" అని నవ్వాడు పర్వతుడు.

పర్వతుడి మాటలు వినేసరికి ఎంతో సంతోషం వేసింది రాయబారులకి. ఉరుకులు పరుగులు మీద మూషిక మహారాజుగారి దగ్గరకి వెళ్లి జరిగినదంతా విన్నవించారు.

ఆ మాటలు విని ఎంతో ఆశ్చర్యం వేసింది రాజుగారికి. "అరే... మన మూషిక వీరులు ఇంతటి గొప్పవారా! ఈ వాస్తవాన్ని ఇంతవరకు గ్రహించలేదు సుమా! ఇంక ఆలస్యం చేయక వెంటనే వెళ్లి మన మూషిక యువరాణికి అన్నివిధాలా అర్హులైన వీరవరులను ఆహ్వానిస్తూ చాటించండి. వారి బలపరాక్రమాలను స్వయంగా పరీక్షించి స్వయంవరం చేసుకుంటుంది చిరంజీవి!" అన్నారు.

మరికొన్ని రోజుల్లో మూషిక స్వయంవరం ఏర్పాటయింది. మూషిక యువరాణి వారిలో తనకి నచ్చిన వారిని వివాహమాడి పదికాలాలపాటు సుఖంగా కాపురం చేసింది.

లోకమంతా వెదికినా చివరకి తమ జాతిలోనే సమ ఉజ్జీ అయిన వరుడు దొరికినందుకు అందరూ ఎంతో ఆనందించారు.

★★★